# దీపం వెలుగు



**-'శ్రీలక్ష్మి'**

"బాగున్నారా, ఇందుమతీ?"

వచ్చని చేనుగట్టుపై పరధ్యానంగా నడుస్తున్న ఇందుమతి ఆశ్చర్యంగా తల తిప్పింది.

పక్క తోటలో టొమాటో మొక్కల మధ్య నిలబడి నుదుట పట్టిన చెమటని తుడుచుకుంటూ చిరునవ్వుతో పలకరిస్తున్నాడు చంద్రశేఖరం.

తనుకూడా చిరు దరహాసం చేస్తూ, "బాగే! మీరుకూడా బాగున్నారు కదూ?" అనడిగింది.

"కనపడుతున్నానుగా!" అన్నాడు బుట్టను కుడి చేతిలో నుండి ఎడమ చేతిలోకి మార్చుతూ.

ఇందుమతి హృదయం ఆనందభరితమయింది. దాదాపు ఏడెనిమిదేళ్లు కావస్తోంది, తాము కలుసుకుని. అతడసలు తనను గుర్తుపట్టగలడా అన్న సంశయంతో వచ్చిన తనకు చక్కని పలకరింపు లభించింది. చాలు. అతిథిగా, పరిచయస్థురాలిగా తనకీ మర్యాద చాలు.

"ఏమిటాలోచన? ఈ చంద్రశేఖరం ఇంకా ఇలానే ఉన్నాడనా?" అన్న చంద్రశేఖరం పలకరింపుకి, "అబ్బే! లేదు, లేదు. ఇప్పుడే పరిపూర్ణ వ్యక్తిత్వం కనిపిస్తోంది మీలో!" అంటూ నాలుక కరుచుకుంది ఇందుమతి.

"మొత్తానికి సంస్కారం గలవా రనిపించుకున్నారు" అన్నాడు చంద్రశేఖరం.

ఇందుమతి చిన్నగా నవ్వి, చకచకా పని సాగిస్తున్న హస్తద్వయంకేసి వింతగా చూడసాగింది.

"రేపు కాలేజీ ఫీజు కట్టాలన్నయ్యా! లేకపోతే పేరు తీసేస్తారు."

అతి మెల్లగా వినవస్తున్న మాటలకు ఎవరా నూతను డనుకుంటూ తల తిప్పింది—చంద్రశేఖరం తమ్ముడు రాజశేఖరం. కొంచెం ఇంచుమించుగా ఇద్దరూ ఒకే పోలికగా ఉండటంతో గుర్తించింది.

నిండిన బుట్టలోని కాయల్ని గంపలోకి వంపుతూ అడిగాడు చంద్రశేఖరం, సాలోచనగా: "రేపే ఆఖరి రోజా? మరి ఇంతవరకూ చెప్పలేదేం?"

"చెప్పుదామనుకుంటున్నాను గానీ!" అంటూ మధ్యలో నాన్చేశాడు రాజా.

చంద్రశేఖరం నవ్వాడు. "చెప్పుదా మనుకున్నావు గానీ, మరిచిపోయావు. అదీ కాక అన్నయ్య గుర్తుంచుకుంటాడేమో

నముకున్నావు. అవునా?" తల తిప్పి తమ్ముడి కేసి చూశాడు.

"కాదన్నయ్యా! నేను ఇంటికి వచ్చే సరికి నువ్వు పొలంలోకి వచ్చేస్తున్నావు. పొలంలోకి వెళితే తోటలోకి వస్తున్నావు. అక్కడ వెదికితే ఇంటికి భోజనానికో, కాలవగట్టుకి షికారుకో వెళుతున్నావు" అన్నాడు మెల్లని స్వరంతో రాజా.

"మొత్తానికి నేను దొరకటం లేదంటావు" అన్నాడు తిరిగి నవ్వుతూ చంద్రం.

రాజశేఖరం మాట్లాడలేదు. కొత్తగా చేరువలో నిలబడ్డ యువతి కేసి ఆశ్చర్యంగా చూస్తూండిపోయాడు.

చంద్రశేఖరం అప్పుడే గుర్తు వస్తున్నట్లు "అన్నట్లు పరిచయం చెయ్యటం మరిచిపోయాను. ఈవిడ నా చిన్ననాటి మిత్రురాలు, ఇందుమతి. నాకు రెండు సంవత్సరాలు జూనియర్. మన పక్క ఊరే! ఇద్దరం కలిసి రోజూ స్కూలుకి వెళుతూండేవాళ్లం. ప్రస్తుతం యూనివర్సిటీలో ఉన్నారు. ఇతను మా తమ్ముడు, రాజశేఖరం. కారణాంతరాలవల్ల కాలేజీ ఫైనల్‌లో ఉన్నాడు" అంటూ పరిచయవాక్యాలు పలికాడు.

"నమస్కారం." మర్యాదగా చేతులు జోడించాడు రాజశేఖరం.

"నమస్కారం." ఎదుటి గట్టుపై నిలబడ్డ ఇందుమతికూడా ప్రతిగా నమస్కరించింది.

"మీది శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీయేనా?" కుతూహలంగా అడిగాడు రాజా.

"అవును." ముక్తసరిగా సమాధానమిచ్చింది ఇందుమతి.

"శ్యామసుందరి తెలుసా?" అడుగుతూనే పెదవి కరుచుకున్నాడు.

చిన్నగా నవ్వుతూ అంది ఇందుమతి: "తెలియట మేమిటి? పరిచయస్థురాలు కూడా! ఇంతకీ ఆవిడ మీకు తెలుసా?" కుతూహలం కనపరిచింది.

రాజశేఖరం బెరుకుగా చంద్రశేఖరం కేసి చూశాడు. అతడు మాత్రం ఇవేమీ గమనించనట్లు బెండముక్కల్ని పరీక్షిస్తున్నాడు.

"నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు." చొరవగా అడిగింది ఇందుమతి.

రాజా మాట్లాడలేదు. తిరిగి తనే అంది: "చదువు, సంస్కారం, సంగీతం, చిత్రలేఖనం—అన్నీ పోగుపెట్టిన సుగుణవతి, అందాలరాశి."

రాజా చిరాకుగా ఇందుమతి కేసి చూసి, చంద్రంవైపు బెరుకుగా చూపులు తిప్పాడు.

చంద్రం మెల్లని స్వరంతో ఆప్యాయత కురిపిస్తూ అన్నాడు: "నాకు తెలుసు, రాజా! సాధ్యమైనంతవరకూ ప్రయత్నం చేశాను. సరే! అదంతా ఎందుకుగానీ, రేపు మధ్యాహ్నం లీజర్ పైముకి కాలేజీకి వస్తాను. లైబ్రరీలో కనిపించు. కలుసుకుంటాము."

"వచ్చే నెలలో సైన్స్ ఎగ్జిబిషన్‌కు హైదరాబాద్ వెళ్లాలట." మరొక మాట అందించాడు రాజా.

జంట గులాబుల్ని చేతులతో సవరిస్తూ అడిగాడు చంద్రం: "తప్పనిసరా?"

"సబ్జెక్టుకు సంబంధించినది కదా?" మెల్లగా వదిలాడు మాటల్ని రాజా.

మెల్లగా నిశ్వాసం వదులుతూ అన్నాడు చంద్రశేఖరం: "సరే! అలాగే వెళుదువుగాని. నువ్వు మాత్రం అనవసరమైన ఆలోచనలు పెట్టుకోకు. ఇంటికి వెళ్లి, స్నానం చేసి, భోజనం చేసి చదువుకో! చీకటి పడుతూంది. జాగ్రత్తగా వెళ్లు. డొంకలో నాన్నగారు కనిపించారా?"

"కనిపించారు. ఈపాటికి ఇంటికి చేరవచ్చు."

"మంచిది. నువ్వుకూడా వెళ్లు. జాగ్రత్త" అంటూ మరొకసారి హెచ్చరించాడు.

"నేనుకూడా రెండు బుట్టలు గోంగూర కోసి వెళతా నన్నయ్యా!" అంటూ కాలు ముందుకు వేయబోయాడు రాజశేఖరం.

"వద్దు, రాజా! పొద్దుటి నుంచీ కాలేజీలో కొట్టుకు కొట్టుకు వచ్చావు. ఇంటికి వెళ్లి స్నానం చెయ్యి. కొంచెం రిలీఫ్‌గా ఉంటుంది. మళ్లీ రాత్రి పన్నెండు గంటలదాకా చదువుకోవాలి."

"ఫర్వాలేదులే! అస్తమానం చదువైనా బుర్ర కెక్కదు" అంటూ తానూ బుట్ట చేతి కందుకున్నాడు రాజశేఖరం.

అంతవరకూ మౌనంగా, పరధ్యానంగా వారి సంభాషణను విననట్లున్న ఇందుమతి హఠాత్తుగా, అప్రయత్నంగా అంది: "ఆదర్శసోదరులు!"

"స్! మరిచిపోయాను— మీ రిందాకటినుంచీ ఇక్కడే ఉన్నారు కదూ? మా గొడవల్లో మీ సంగతే గుర్తులేదు. ఆఁ! అన్నట్లు చూడు, తమ్ముడూ! పక్క పొలంలో రాము లున్నాడేమో — ఇంటికి కబురు పంపు చుట్టాలొచ్చారని" అన్నాడు చంద్రశేఖరం మర్యాద ఉట్టిపడే కంఠంతో.

"ఇంటి దగ్గర కనపడే వచ్చాను" అని చెప్పబోతున్న ఇందుమతి కంఠం దగ్గరలో నిలబడ్డ పాలపిట్టపై దృష్టి పడటంతో ఆగిపోయింది.

"రాములుకూడా ఇంటి దగ్గర పనున్నదంటూ నాన్నగారితో కలిసి వెళ్లిపోయాడు" అని చెప్పాడు రాజా.

"అయితే ఎలాగా? పోనీ, ఒక పని చెయ్యి. ఆ బుట్ట ఇలా ఇచ్చి నువ్వింటికెళ్లు. అమ్మతో ఈ సంగతి చెప్పు" అన్నాడు చంద్రశేఖరం.

దీపం పరులకు వెలుగు ఇవ్వడంకోసం తను ఆహుతి అవుతుంది. నిజమే. కాని, అదెంతవరకు? ఎప్పుడో? ప్రమిదలో నూనె లేనంతవరకు. నూనె ఉన్నంతవరకు, వత్తిని పైకి జరుపుతున్నంతవరకు అది జీవితకాలం వెలగగలదు. మానవ జీవిత పరిమాణానికి సరిపడ వత్తిని ముందుగా వేసుకొంటే, దీపంగురించి బెంగపడవలసిన అవసరం ఉండదేమో!

ఇక తప్పించుకోవటం అసాధ్యమనిపించి ఎడమ చేత్తో లుంగీ అంచుల్ని పట్టుకుని గట్టెక్కాడు రాజశేఖరం.

"జాగ్రత్త. మెల్లగా వెళ్లు. అన్నట్లు మీరుకూడా వెళ్లండి. చీకటి పడుతూంది" అన్నాడు చంద్రం, ఇందుమతి కేసి తిరిగి.

ఇందుమతి నవ్వి, అంది: "ఆనాటి పన్నెండేళ్ల పాపను కాదు, భయపడటానికి."

"ఎంతైనా చదువుకున్నవారు . . ." అన్నాడు చిలిపిగా చంద్రశేఖరం.

"ఎంత చదువుకున్నా పల్లెటూరి వార్ని మించలేం" అంది ఇందుమతి.

ఈసారి నవ్వటం చంద్రం వంతు అయింది. అప్పటికి రాజశేఖరం మలుపు తిరిగాడు. శుక్లపక్ష దశమి చంద్రుడు ఉదయించ యత్నిస్తున్నాడు. మసక వెలుగులో పక్క చేలోని పైరు ఒయ్యారంగా నాట్య మాడుతూంది. వర్షాలు వెనకపట్టి చలి ప్రారంభం కాబోతూంది. తెల్లని జరీ అంచు పైట చెంగుని కుడిభుజం మీదుగా తీసుకుని నిండుగా కప్పుకుంది ఇందుమతి.

"అదృష్టవంతులు" అన్నాడు చూపులు తిప్పుకుంటూ చంద్రశేఖరం.

"అసూయగా ఉందా?" కళ్లు విశాలం చేస్తూ అడిగింది ఇందుమతి.

కంఠంలోని కొంచెతనాన్ని కప్పిపుచ్చుతూ అన్నాడు చంద్రం: "మానవుడు స్వార్థజీవి, ఇందుమతీ!"

"నిజమే. తరతమ భేదాల్ని మాత్రం విడువరు" అంది, చిరుకోపంగా ఇందుమతి.

"ఎంతైనా ఆడపిల్లలు!" గంభీరంగా అన్నాడు.

"బహువచన ప్రయోగానికి ఇక్కడెంద రున్నారు?" జరీ అంచు చీర కుచ్చెళ్లు ఒయ్యారంగా పాదాలమీద నాట్యమాడుతుంటే అడిగింది ఇందుమతి.

చంద్రశేఖరం మాట్లాడలేదు. పక్కనున్న నీటిగుంటలో కాళ్లు, చేతులు కడుక్కుని, మామిడిచెట్టు కొమ్మకు తగిల్చిన లాల్చీ నందుకుని గంభీరంగా అడుగులు వేసుకుంటూ ఇందుమతి దగ్గరకు వచ్చాడు. అత డలా మౌనం వహించటంతో ఆశ్చర్యపోయింది ఇందుమతి.

"కూర్చోండి, ఇందుమతీ!" వచ్చి గడ్డిపై కూలబడుతూ అన్నాడు చంద్రం, మౌనం వదిలి.

ఇందుమతికూడా కూర్చుంది.

కొంచెం సమయం గడిచిన తరవాత అన్నాడు చంద్రశేఖరం: "ఒక ముఖ్యమైన సంగతి అడుగుతాను— ఏమను కోరు కదూ?"

లేదన్నట్లు తల ఊపింది ఇందుమతి.

"శ్యామసుందరి మీకు బాగా తెలుసా?"

"తెలుసనే అనుకుంటున్నాను" అంది అప్రయత్నంగా నవ్వుతూ.

"దయచేసి నవ్వకండి, ఇందుమతీ!"

ఇందుమతి చేతిలోని పైటచెంగుని పరీక్షిస్తూ అంది: "నే నెప్పుడైనా అబద్ధం చెప్పటం మీ రెరుగుదురా?"

"లేదు. మీరు అబద్ధం చెప్పటం కాదు. మర్యాదస్థులు. మా శ్రేయోభిలాషులుకూడా నన్న నమ్మకంతో అడుగుతున్నాను."

రెండు క్షణాలు ఊరుకుని అంది ఇందుమతి: "మీ నమ్మకానికి కృతజ్ఞురాలిని. నాకు తెలిసినంతవరకూ ఇందాకా చెప్పినదంతా వాస్తవమే!"

"అయితే మా రాజా అదృష్టవంతుడు కాగలడంటారు?" అతని నేత్రద్వయంలో సంతృప్తి తళుక్కున మెరిసింది.

ఇందాకా తెలియనట్లు ఊరుకున్న దంతా నటనన్న మాట. జ్యేష్ఠ సోదరుడుగా ఎంత బాధ్యత, గౌరవం, మర్యాద!

ఆమె మౌనం పూనటంతో, తిరిగి తనే అన్నాడు: "శ్యామసుందరికి మా వాడు తగినవాడే కదూ?"

"అదేం?" విస్తుపోతూ అడిగింది ఇందుమతి.

గొంతులో కదలాడే బాధను అణిచిపెడుతూ అన్నాడు చంద్రశేఖరం: "పరిస్థితు లనుకూలిస్తే మా రాజా

కూడా ఇప్పుడు యూనివర్సిటీలో ఉండేవాడు."

ఇందుమతి అలాగా అన్నట్టు తల తిప్పి ఊరుకుంది.

తిరిగి చంద్రం అన్నాడు: "బహుశః శ్యామసుందరి పరిచయం అనాటి దనుకుంటాను, మా రాజాకు. ప్చ్! అదృష్టం, అవకాశం అందరికీ కలిసి రావు. చక్కగా చదువుతాడు. అన్నయ్య కష్ట పడుతున్నాడని వాతోపాటు ఒళ్ళొంచు తాడు, సమయం చిక్కినప్పుడల్లా! అయినా వాడికి రెండు సంవత్సరాలు వృథా అయ్యాయి. అన్నయ్యపై గౌరవంతో అన్నీ చెపుతాడు. మిత్రుడుగా సరదా కబుర్లు చెపుతాడు. అయితే శ్యామసుందరి విషయం మాత్రం ఇంత వరకూ ప్రస్తావించలేదు— నే నేమను కుంటానోనని భయం. ఎంత పెద్ద వాణ్ణైనా తనని, తన మనసుని అర్థం చేసుకోలేనంతటి మూర్ఖుణ్ణి ఎలా కాగలను?" సన్నని బాధ కదలాడింది అతని స్వరంలో.

"భయ భక్తులకు ప్రతిరూపం!" అంది ఇందుమతి అభిమానంగా.

"అన్నయ్యగా భయభక్తుల్ని స్వీక రించగలను గాని, వాటి పేర వాడి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని, సధర్మ హృదయాన్ని ఎలా అరికట్టగలను?" అన్నాడు చంద్రశేఖరం.

మనఃస్ఫూర్తిగా అంది ఇందుమతి: "నిజమైన అన్నయ్య మీరు."

సంతోషంగా అన్నాడు చంద్రం: "చాలా థాంక్స్, ఇందుమతీ! చక్కని విషయం చెప్పారు. మీ రిలా రాకపోతే శ్యామసుందరి విషయం, మా రాజాకోర్కె మరుగునే ఉండిపోయేవి. దైవానుగ్రహం బాగుంటే త్వరలో శుభవార్త విందురు గాని. మా రాజా పెళ్ళికి మీరు ముఖ్య అతిథులు. మా రాజా పెళ్ళేమిటి? మీ శ్యామసుందరి పెళ్ళి."

"మీ పరిచయంకన్నా శ్యామసుందరి పరిచయం ముఖ్యమైనదా వాకు?" నిష్ఠురంగా అడిగింది.

హృదయపూర్వకంగా అన్నాడు చంద్రం: "అదృష్టవంతుణ్ణి, ఇందుమతీ! నా విద్యాభ్యాసం ముగిసి ఎనిమిదేళ్ళు దాటాయి. అయినా నన్ను, నాపరిచయాన్ని దృష్టిలో ఉంచుకు వచ్చారు. మీ కే విధంగా కృతజ్ఞత చెప్పుకోను?"

"టైమ్ ఎనిమిది కావస్తోంది." ప్రసంగం మారుస్తూ అంది ఇందుమతి.

అప్పటికే చంద్రుడు బాగా పైకెక్కాడు. కించిత్తు నిర్ఘాంతపోయిన చంద్రశేఖరం లేచి నిలబడ్డాడు. అతడు ఇంటికి రాబోయే ముందు బట్టలన్నీ గట్టుపై నున్న పాకలోకి సర్ది గుప్పెడు చామంతులు, రెండు జామపళ్ళు పట్టుకు వచ్చాడు.

"చక్కని శుభవార్త అందించిన మీకు చిన్న కానుక" అంటూ పళ్ళు, పువ్వులు అందించాడు. చామంతుల మధ్యలో రెండు గులాబులుకూడా ఉన్నాయి.

"థాంక్స్! ఇవన్నీ ఇప్పుడే తీసుకోవాలా?" నవ్వుతూ గులాబులు మాత్రం అందుకుంది.

"మనఃపూర్వకంగా ఇస్తున్నప్పుడు తిరస్కృతి పనికిరాదు. తీసుకోండి" అన్నాడు, తానూ నవ్వుతూ చంద్రశేఖరం.

"పువ్వులైతే తలెలాగో భరిస్తుంది. మరి ఒక్కసారిగా రెండు జామపళ్ళు?"

"తినగలగాలి. అన్ని పరీక్షలు, అంత చదువు భరించగలిగిన మీ పొట్ట రెండు జామపళ్లను భరించలేకపోతే ఓపి కెలా?"

"పాపం, మాటలతో మీ రెంత అలిసిపోయారో! మీ కో నగం" అంది కాలవగట్టు దిగి, డొంకదారి పడుతూ ఇందుమతి.

ఇదుగో! నోటికంతా రక్షణ చేకూర్చే
టూత్ పేస్ట్ — నీమ్
నీమ్ టూత్ పేస్ట్ మీ పళ్ళను శుభ్రపరచడమే గాదు, నీమ్ టూత్ పేస్ట్‌లో ఆరోగ్య ప్రదాయిని వేప (నీమ్)కు వుండే అద్భుత లక్షణాలన్నీ వున్నాయి. పళ్ళను గట్టిపరిచి చిగుళ్ళకు రక్షణచేకూర్చి, దుర్వాసనను నివారించి, మీ నోటిని సర్వదా స్వచ్ఛంగా వుంచుతుంది.


కలకత్తా కెమికల్ వారి ఉత్పత్తి

కి గెలుపు మీదే కావా
. అయినా మా సహాయం లేనిదే
మీ సాధ్యంగానీ. . ." అంటూ జేబులో ఉన్న తాళంచెవుల గుత్తిలోని చాకుతో ముక్కలు కోసి కొన్ని ఇందుమతి కందించి, కొన్ని తను తీసుకున్నాడు.

కొంత దూరం మాట్లాడకుండా నడిచిన చంద్రం అన్నాడు: "ఈ సంవత్సరం గడిచిన తరవాత మా రాజాని యూనివర్సిటీకి పంపాలి."

"మీ లాటి అన్నయ్య ఉంటే యూనివర్సిటీకేం ఖర్మ ఫారెన్‌కూడా వెళ్లగలరు" అంది ఇందుమతి.

"చదువైన తరవాత మీ రేం చెయ్యాలనుకుంటున్నారు?" విషయం తిప్పాడు.

"ముందే ఊహాలు పెంచుకు డిజప్పాయింట్ కావటం నా సిద్ధాంతం కాదు. దైవనిర్ణయ మెలా ఉంటే అలా జరుగుతుంది."

"ఇందుమతి, ఎమ్. కామ్." సాలోచనగా అన్నాడు చంద్రశేఖరం.

"మీరుకూడా చదువు సాగిస్తే చంద్రశేఖరం ఎమ్. కామ్. అయ్యేవారు."

"చంద్రశేఖరం కాకపోతే రాజశేఖరం. ఏ శేఖరమైనా మేము అదృష్టవంతులమే, ఇందుమతీ!"

ఇందుమతి మాట్లాడలేదు.

ఇంటి గేట్లో అడుగు పెడుతూనే కోపంగా అన్నాడు చంద్రం: "ఎన్ని సార్లు చెప్పాలిరా, రాజా? ఆ గొడ్ల సంగతి నేను చూసుకుంటాను. నువ్వు స్నానం చేసి చదువుకోకపోయావా?"

"అయిపోయిం దన్నయ్యా! మేత వేసి వెళ్లిపోతాను" అంటూ గొడ్లసావిడి లోంచి బయటికి వచ్చిన రాజశేఖరం ఇందుమతీ చంద్రశేఖరాల కేసి రెండు క్షణాలు పరీక్షగా చూసి ఇంట్లోకి వెళ్లి పోయాడు.

* * *

మర్నాడు చంద్రశేఖరానికి శ్రమ కలిగించకుండా లైబ్రరీ హాల్లో కాకుండా మెయిన్ గేట్లోనే కనిపించాడు రాజశేఖరం.

"క్లాసయిపోయిందా, ఇక్కడ నిల బడ్డావ్?" సైకిల్ దిగుతూ అడిగాడు చంద్రం.

"లాస్టవర్ ఖాళీ! ఎలాగూ పనేం లేదు కదాని ఇక్కడే నిలబడ్డాను" అంటూ చంద్రశేఖరం కేసి వింతగా, పరిశీలనగా చూశాడు రాజా. ఎప్పుడూ మోచేతి వరకూ మడిచి ఉండే చేతులు ఫుల్‌గా విడిచి ఉన్నాయి. ఉంగరం ఉండవలసిన వేలికి ఆనమాలు మాత్రం ఉంది, దాని స్థానే!

"అన్నయ్యా!" రాజశేఖరం నోరు తెరిచి అడగబోయాడు.

"నాకు తెలుసు, రాజా! ఇది కాలేజీ! టైమవుతోంది, పద." రాజాకంటె తానే ముందు దారి తీశాడు చంద్రం.

ఆఫీసు రూముకు వెళ్లి, ఫీజు కట్టి బయటికి వచ్చారు. పర్సులో నుంచి నాలుగు పది రూపాయల కాగితాలు తీసి తమ్ముడి చేతిలో పెడుతూ అన్నాడు చంద్రశేఖరం: "చూడు, రాజా! కాలేజీ విడిచిపెట్టాక అలా బజారుకి వెళ్లి మంచిది, మన్నికగా ఉండేది షర్టింగ్ క్లాత్, పాంట్ క్లాత్ తీసుకురా! అసలు నేనే వెళ్లేవాణ్ణి. తోటలో పని చూసుకునే టైమవుతూంది. మరిచిపోవు కదూ?" మాట్లాడుతూనే సైకిలెక్కాడు.

చేతిలో రూపాయల్ని, దూరంగా వెళు తున్న చంద్రాన్ని మార్చి మార్చి చూడ సాగాడు రాజా కొన్ని క్షణాల వరకు. సూటు ఎవరికి? ఇంత అర్జెంటుగా ఎందుకు? బహుశః తనకి కావాలేమో? కాదు, ఇంట్లో వాడుకునేందుకు రెండు సామాన్యమైనవి, బయటికి రెండు టెరి లీన్ జతలు ఉన్నాయి. హఠాత్తుగా చంద్రశేఖరం రెండు రోజుల నాడు అన్న మాటలు గుర్తు వచ్చాయి.

'ఆ రోజు స్పెషల్ క్లాసెస్ ఉన్నాయి. తప్పక అటెండ్ కావాలి. రాత్రి ఉతికిన రెండు షర్ట్సు ఆరలేదు. టైమయి పోతూంది. ఎలాగో తోచక బాధ పడు తుంటే అన్నయ్య అన్నాడు: "ఈ రోజుకి నా షర్ట్ వేసుకెళ్లు, రాజా! రెండు రోజుల్లో మంచిషర్ట్ కటికొనుక్కుందువు గాని."

అన్నమాట ప్రకారం రెండు రోజుల్లో షర్ట్‌కి డబ్బు లిచ్చాడు. రేపు కడతానన్న కాలేజీ ఫీజు కట్టాడు. రేపు సైన్స్ ఎగ్జిబిషన్‌కుకూడా ఏ సైకిలైనా అమ్మి. . . కావలిసింది, తాడుక్కోవలి సింది తను కనక తన చేతికే డబ్బు లిచ్చాడు, ఒకవేళ తనే తెస్తే రాజాకి నచ్చదేమోనన్న సందేహంతో. ఎంత మంచి అన్నయ్య!' రాజశేఖరం కళ్లు చెమర్చాయి.

రెండు సార్లు తప్పేసరికి చదువులో తన శ్రద్ధ తగ్గించాడు. ఇంటి పనుల్లో ఆసక్తి కనపరిచాడు. తనవల్ల ఇంట్లో వాళ్లకి కష్టం కలగకూడదన్న ఉద్దేశ్యంతో నాన్నగారికి ధైర్యంగా ఎదుటపడి చెప్ప లేక అమ్మతో చాటుగా అన్నాడు: "నాన్న ఎన్నాళ్లని సంపాదించి పెడతారమ్మా! పెద్దవాణ్ణి, నాన్నగారి తరవాత నాన్నగారి కున్నంత బాధ్యత గలవాణ్ణి. ఎన్నాళ్లీ చదువు నెపంతో ఏ పనీ లేకుండా కూర్చోను? రేపటినుంచీ నేనుకూడా పొలం వెళతాను. తోటలో పని చూసు కుంటూ ప్రైవేటుగా చదువుకుంటాను."

తరవాత అమ్మ ఎంత బతిమాలినా, నాన్నగారు ఎంత మంచిగా మందలించినా ప్రయోజనం లేకపోయింది. అన్ని పను లతోబాటు నాన్న బాధ్యతల్నికూడా క్రమంగా స్వీకరించాడు. ఆ నాటినుంచీ ఎలా తెస్తున్నాడో కుటుంబానికి ఏ లోటూ లేకుండా గడుపుకొస్తున్నాడు, సాధ్యమైనంతలో.

చేతిలో కాగితాలు రెపరెపలాడుతుంటే రాజశేఖరం ఆలోచనల నుంచి తేరు కున్నాడు. ఎంత మనసును సరిపెట్టుకొన యత్నించినా ఆ డబ్బుతో షర్టింగ్‌బట్ట కొనలేకపోయాడు. అలా అని కొనకుండా వెళితే అన్నయ్య ఊరుకోడు. ఆలోచనలు తెగక కొట్టు ముందు అర గంటసేపు నిలబడిపోయాడు.

అంతలో హఠాత్తుగా ఇందుమతి విషయం గుర్తుకొచ్చింది. ఆవిడ బహుశః రేపో, ఎల్లుండో వెళ్లిపోవచ్చు. రాకరాక వచ్చిన అతిథి. అందులో అన్నయ్యకు ఆత్మీయురాలు. వట్టి చేతులతో ఎలా పంపేది? తన కున్నవి రెండు సూట్లైనా కొత్తగానే ఉన్నాయి. ఈ సంవత్సరం గడిచిపోతుంది. అంతగా అవసరం ఉంటే ఈ పంటల్లో కుట్టించుకోవచ్చు అనుకుంటూ చక్కటి చీరె, జాకెట్ బట్ట తీసుకుని హుషారుగా ఈల వేసు కుంటూ సైకిలెక్కాడు.

ఊరి చివర కాలవ గట్టుపై లేతాకు పచ్చ చీరెపై ముదురు ఆకుపచ్చ జాకెట్ ధరించి, ప్రకృతి కన్యలా దర్శన మిచ్చింది ఇందుమతి. ఆమెను చూసి ఏదో ఊహి స్తూన్న రాజశేఖరం ఆమె తనంతట తానే దగ్గరగా వచ్చి పలకరించటంతో సైకిలు దిగి, తానూ ఆమె పక్కగా నడక సాగించాడు.

కొంత దూరం నడిచిన తరవాత ఇందుమతి అంది: "శ్యామసుందరి పెళ్లి సెటిలయింది."



"నిజంగా? !" విభ్రాంతుడయ్యాడు రాజా.

"ఇందుమతి అబద్ధం ఆడగా విన్నారా?" సీరియస్‌గానే అడిగింది.

నమ్మకంగా అన్నాడు రాజశేఖరం: "లేదు." అంతే. అంతకు మించి మాట్లాడలేదు.

మునిపంటితో కింది పెదవిని నొక్కి పెడుతూ అంది ఇందుమతి: "అతని దే ఊరో, ఏం చేస్తున్నాడో, ఎవరు కుదిర్చారో వివరా లడగరేం? కుతూహలం లేదా?"

సామాన్యంగా అన్నాడు రాజా: "వివరాలకేం లెండి! ఎప్పుడైనా తెలుస్తాయి. అయితే ముఖ్య విషయం. అతడు ఆమెకు తగిన వాడైతే చాలు. శ్యామసుందరి అదృష్టవంతురా లవుతుంది."

"తగనివాళ్లనికూడా ఎంచుతారా?" మాటిగా ప్రశ్నించింది.

గంభీరంగా అన్నాడు రాజశేఖరం: "ఎంచనిసందర్భాలుకూడా లేకపోలేదుగానీ, శ్యామసుందరి విషయంలో అలా జరగదని నా నమ్మకం."

"ఎందు కంత నమ్మకం?" అతని ముఖంలోకి చూస్తూ అడిగింది.

"ఎందుకనో నాకు తెలియదు. ఏది ఏమైనా మంచి శుభవార్త అందించారు" అన్నాడు, దూరతీరాలపై దృష్టి నిలుపుతూ.

"మీకూ శుభప్రదమైనదేనా?"

"అనే అనుకుంటున్నాను."

"ఓహో! మీ అన్నయ్య కుదిర్చారుగా — అందుకనా?"

రాజశేఖరం తొణకలేదు. పైగా— "అన్నయ్య కుదిరిస్తే దాని కిక వంక పెట్టాల్సిన పని లేదు. శ్యామసుందరి అక్షరాలా అదృష్టవంతురాలు. చక్కని వార్త అందించారు" అన్నాడు.

ఇందుమతి లోలోన అమితంగా విస్తుపోయింది. 'మీ అన్నయ్య నీ ప్రేయసికి పెళ్లి చేస్తున్నాడంటే కించిత్తు చలించ డేం? అన్నయ్యపై ఎంత అభిమానం!' అనుకుంటూ, "మరి నాకు ప్రెజెంటేషన్?" అంది నవ్వుతూ.

"ఇచ్చింది తీసుకోగలరా?" చటుక్కున ఆమె కేసి తిరుగుతూ అడిగాడు, నడక ఆపి.

"తప్పకుండా!" అంది బింకంగా.

"మాట తప్పరుగా?" రెట్టించాడు రాజశేఖరం.

"ఇంతవరకూ జరగలేదు. ఇక ముందు జరగదన్న నమ్మకంకూడా ఉంది" అంది దృఢంగా.

రాజశేఖరం తల తిప్పి, జాగ్రత్తగా దారి చూసుకుంటూ నడక సాగించాడు, పక్కగా గజం దూరంలో ఇందుమతి నడుస్తోంది.

ఉన్నట్టుండి రాజశేఖరం అన్నాడు: మెల్లని గంభీర స్వరంతో: "అన్నయ్య వరసగా చదువు సాగిస్తే ఈ పాటికి ఎమ్. కామ్. పూర్తిచేసి లెక్చరర్ అయ్యేవాడు. వాడికి చదువుమీదకన్నా వ్యక్తుల మీద, బాధ్యతల మీద దృష్టి ఎక్కువ. అందుకు నిదర్శనం నేనే! రెండు సంవత్సరాలనాడు ఇక జీవితంలో విద్యావకాశం లేదనుకున్న నన్ను, తోటివారు చదువుకుంటుంటే నేను చిన్నబోతానని ఎలా తెస్తున్నాడో తిరిగి కాలేజీలో చేర్పించాడు. తన కున్న అదృష్టాన్ని కాలదన్ని నాకు కల్పించాడు, తను తప్పుతున్నానన్న నెపంతో. ఈ రోజు నేను బి. కామ్. చేస్తున్నానంటే అదంతా అన్నయ్య చలవే!

దీపం పరుల కోసం తన్ను తాను కాల్చు కుంటుందంటారు. అయితే అదెంత వరకు? ఎప్పుడో? ప్రమిదలో నూనె లేనప్పుడు. నూనె ఉన్నంతవరకు, వత్తిని పైకి జరుపుతున్నంత వరకు అది జీవిత కాలం వెలగగలదు. కాకపోతే, మానవ జీవిత పరిమాణానికి సరిపడ వత్తిని ముందుగా వేసుకుంటే దీపం గురించి బెంగపడ వలసిన పని లేదు. ఇక్కడొక ముఖ్యమైన సంగతి.

అన్నయ్య దీపమైతే, మేము వెలుగు మాత్రమే! దాని వెలుగును కాంక్షించే వారమే గానీ, వాడి జీవిత ప్రమిదలో చమురు ఏ గాలి వాటుకూ దెబ్బ తినకుండా కాపాడటం, వత్తిని పైకి తోస్తుండటం మాకు సాధ్యం కాని పని. అందుకు అన్నయ్యకన్నా విజ్ఞానవంతురాలు, వివేకవతి, సుగుణవతి వాడికి సహధర్మచారిణిగా రావాలి. ఇంతకుమించి నేను మీ కేం చెప్పగలను? ఇలా ధైర్యంగా ఎదురుగా చెబుతున్నందుకు అన్యథా భావించకండి. సర్వదా నా శుభాన్ని కోరే అన్నయ్య సుఖపడాలి. మీ కేం అభ్యంతరం ఉండదనుకుంటాను. పరస్పరం మీ రిరువురూ వ్యక్తిత్వాలు, మనస్తత్వాలు తెలిసినవారు. మీ గురించి మీకే ఏం చెప్పను? శ్యామసుందరికి శుభాకాంక్షలు పంపుతానని చెప్పండి. వస్తాను."

మాట్లాడుతున్నవాడల్లా చటుక్కున సైకిలెక్కి వెళ్లిపోయాడు రాజశేఖరం.

ఇందుమతి అతడు వెళ్లిన వైపే విభ్రాంతురాలై చూస్తుండిపోయింది. ★

పార్క్-డేవిస్
త్రివిధోపయుక్తమైన
నికో సబ్బు
చర్మ సంరక్షణకు సబ్బు లన్నిటిలో
సాటి లేని మేటి

1 నికో చర్మ క్రిములను సంహరిస్తుంది
2 నికో చెడు వాసనలను అరికట్టుతుంది
3 నికో చర్మమును శుభ్రపరచి సంరక్షిస్తుంది

చర్మమును ఆరోగ్యవంతంగా ఉంచుకొను టకు, నికో సబ్బుతో ప్రతి రోజూ స్నానం చెయ్యండి. దాని యాంటి సెప్టిక్ గుణం గల నురుగు చర్మ క్రిములను సంహరిస్తుంది. నికోయొక్క ఔషధగుణాలు చర్మంనుండి చెమట వాసనలను హరిస్తాయి. మీ చర్మ ఆరోగ్యం దినదినాభివృద్ధి చెందుతుంది.

నికోలో ఉన్న శక్తివంతమైన క్రిమినాశక పదార్థం చర్మ వ్యాధులను నిరోధించి, మీ చర్మమును తేజోవంతంగా, చైతన్య వంతంగా నిత్యనూతనంగా ఉంచుతుంది. చెమట పొక్కులు, మొటిమల నరికట్టి నికో మీ చర్మమును రక్షిస్తుంది. నికోతో ప్రతిరోజూ తల రుద్దుకుంటే, చుండు రాకుండా కాపాడుతుంది.

మీ చర్మపు ఆరోగ్యమును, లావణ్యమును రక్షించుకొనుటకు, మూడు విధముల లాభదాయకమైన నికో వాడటం నేడే ప్రారంభించండి.




మీరు నికో సబ్బు వాడటం అలవాటు చేసుకోండి
ఇది మీ చర్మ సంరక్షణకు చాల అవసరం.

® Regd. Trade Mark. Regd. Users—Parke Davis (India) Ltd., Bombay-73 AS.